క్లుప్తంగా

కార్మెల్ కొండపై భక్తుల పూజలు

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే వాహనాలు, బస్సుల్లో వచ్చిన భక్తులు కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి కార్మెల్ మాత వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండ దిగువున ఉన్న మరియమాత మందిరం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

ద్వారకా నగర్‌లో పూరిల్లు దగ్ధం

మంగళగిరి: నగరంలోని ద్వారకా నగర్‌లో ప్రమాదవశాత్తూ ఓ పూరిల్లు దగ్ధమై సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ద్వారకానగర్‌కు చెందిన నల్లగొర్ల పిచ్చియ్యకు చెందిన పూరింటిలో శనివారం రాత్రి పొయ్యిపై వంట చేస్తున్న సమయంలో నిప్పురవ్వలు గాలికి పైకి లేచి ఇంటికి అంటుకున్నాయి. స్థానికులు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఇంటితో పాటు సామాన్లు, వస్త్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. తహసీల్దార్ జి.వి. రామ్ ప్రసాద్ బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకుల్ని అందజేశారు. బాధిత కుటుంబానికి గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇంటి నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆర్థికసాయం నిమిత్తం కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ సాంబశివరావు, వీఆర్వో రాజ్యలక్ష్మి, యదుల్లా పాల్గొన్నారు.

31న విఖనసాచార్యస్వామి జయంతి



ఫిరంగిపురం: విఖనస జయంతిని (ఈ నెల 31) శాఖీయులందరూ జయప్రదం చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా అర్చక సంఘ సభ్యుడు, తిరుమల శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ సంయుక్త కార్యదర్శి రొంపిచర్ల ఆంజనేయులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నరసరావుపేటలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో 31న విఖనసాచార్యస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామికి విశేష అర్చన, నీరాజనం, మంత్రపుష్పం, చతుర్వేదాల విజ్ఞాపనం, తీర్థప్రసాద వితరణ తరువాత తదియారాధన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం పదో తరగతి పరీక్షలలో అధిక మార్కులు సాధించిన శాఖీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. కృష్ణ యజుర్వేదంలో డాక్టరేట్ పొందిన వేదాంతం రామకృష్ణ(టీటీడీ వేద విశ్వవిద్యాలయం పండిట్), పి. ధ్వనంతరీ వరప్రసాద్(ఆయుర్వేద ఎండీ), ఆగమ విద్వాన్ దీవి. పవన్‌కుమార్‌లకు సన్మానం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఖానస శాఖీయులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియా ఆల్మాస్ ప్రతిభ



మంగళగిరి: షార్జా యూఏఈ వేదికగా జరిగిన ఫస్ట్ ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా ఆల్మాస్ నాలుగు బంగారు పతకాలతో పాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్ కైవసం చేసుకున్నట్లు కోచ్ ఎస్‌కే సంధానీ ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ ఘనత సాధించిన మొట్టమొదటి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అని పేర్కొన్నారు. ఆమె కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతోందని చెప్పారు. ఈ సందర్భంగా సాదియా ఆల్మాస్‌కు సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ప్రభాకర్, కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, నేషనల్ పవర్ లిఫ్టర్ బి. ప్రసాద్, మంగళగిరి లిఫ్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి కొమ్మాకుల విజయ భాస్కరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

ఎన్జీవో మహా సభల్ని జయప్రదం చేయండి

మంగళగిరి: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు ఉద్యోగులంతా హాజరై జయప్రదం చేయాలని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ మంగళగిరి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, బాలనాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగబ్రహ్మం ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహాసభల్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ఇందుకోసం సబంధిత శాఖ అధికారుల నుంచి ఇప్పటికే అనుమతి కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. మహాసభలకు హాజరయ్యే ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 157 జీవో ప్రకారం ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసినట్లు వెల్లడించారు.

అర్ధ శతాబ్ది రహ'దారి'ద్ర్యానికి మోక్షం

- రూ.2.5 కోట్లతో ఉండవల్లి- గుంటూరు చానల్ కరకట్ట రోడ్డు నిర్మాణం
- ఉండవల్లి బైపాస్ రోడ్‌గా ఉపయోగం
- పూర్తయిన పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉండవల్లి గ్రామస్తులు



గుంటూరు చానల్‌పై బీటీ రోడ్డు

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఎంటీఎంసీ పరిధిలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత యాభై ఏళ్లుగా తట్ట మట్టి కూడా వేయని పలు రోడ్లను సైతం అందంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దానిలో భాగంగానే ఉండవల్లి– గుంటూరు చానల్ కరకట్ట వెంబడి రూ. 2.5 కోట్లతో 1.5కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. విజయవాడ, గుంటూరు మహానగరాలకు మధ్యలో, కృష్ణా తీరంలో ఉండడంతో ఉండవల్లి శరవేగంగా అభివృద్ధి చెందింది. 40–50 సంవత్సరాల కిందటే పంట పొలాలు నివాస స్థలాలుగా మారాయి. అప్పటి నుంచి సరైన రహదారి లేక అమరావతి రోడ్డుకు ఇరువైపులా, గుంటూరు చానల్ కరకట్ట వెంబడి నివాసాలు ఉంటున్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముళ్ల పొదల్లోను, బురదలోనూ నడక సాగించేవారు. చిన్నపాటి వర్షం పడినా నరకయాతన పడేవారు. 2021 డిసెంబర్‌లో ఎమ్మెల్యే ఆర్కే ఆ ప్రాంతాన్ని పర్యటించినపుడు అక్కడి ప్రజలు సరైన రహదారి లేక పడుతున్న ఇబ్బందుల్ని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి అమరావతి రోడ్డుకు రెండువైపులా కరకట్టను పరిశీలించారు. వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేసి, గ్రావెల్ రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. అప్పటి నుంచి ఆ రహదారిని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నారు. చివరకు ఉండవల్లి, పెనుమాక ప్రజలతో పాటు అమరావతి వైపు రాకపోకలు సాగించే ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేవిధంగా ఈ రహదారి నిర్మాణం జరగాలంటూ ఆయన సూచించారు. అక్కడున్న 10 ఎకరాల రైతులతో మాట్లాడారు. కొండవీటి వాగు కట్టకు అనుబంధంగా 40 అడుగుల రోడ్డును కూడా కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వరకు నిర్మించాలని అధికారుల్ని ఆదేశించారు. మూడుసార్లు గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత చివరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. నేడు పూర్తవడంతో గ్రామస్తులతో పాటు అమరావతికి రాకపోకలు సాగించే ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సమయంలో ఉండవల్లి సెంటర్‌లో ట్రాఫిక్ నిలిచిపోవడంతో అమరావతి నుంచి విజయవాడ వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండవీటి వాగు ఎత్తిపోతల పథకానికి వెళ్లి, అక్కడి నుంచి అమరావతి కరకట్ట మీదుగా ప్రకాశం బ్యారేజ్ చేరుకునే విధంగా రోడ్డు నిర్మించడం వల్ల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందనే ఆలోచనతో నిర్మించినట్లు ఎమ్మెల్యే ఆర్కే, అధికారులు స్పష్టం చేశారు.

భయంభయంగా కరకట్ట ఎక్కేవాళ్లం



10 సంవత్సరాల నుంచి గుంటూరు చానల్ పక్కనే నివాసముంటున్నాం. చానల్ కరకట్ట ఎక్కాలంటే భయభయంగా ఉండేది. కట్ట 40 అడుగులు ఉన్నప్పటికీ నడవడానికి రెండు అడుగుల బాట మాత్రమే ఉండేది. ఆ దారిలో నడుచుకుంటూ వెళుతుంటే పాములు కనిపించేవి. పిల్లలను బయటకు పంపాలంటే భయం వేసేది. ఎమ్మెల్యే ఆర్కే వచ్చిన తరువాత రెండు సంవత్సరాల్లో గుంటూరు కరకట్ట వెడల్పు చేసి బీటీ రోడ్డు నిర్మించారు. ఈ రహదారి మాకే కాదు, రైతులకు, అమరావతి వెళ్లేవారికి ఎంతో ఉపయోగపడుతుంది.

– పూర్ణచంద్ర తెమల

రోడ్డు వస్తుందని కలలో కూడా అనుకోలేదు



40 సంవత్సరాల నుంచి గుంటూరు చానల్ పక్కనే ఉన్న జామాయిల్ తోటలో నివాసముండేవాళ్లం. ఐదు సంవత్సరాల కిందట గుంటూరు చానల్ పక్కకు వెళ్లాం. సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడేవాళ్లం. గతంలో గుంటూరు చానల్ పక్కన నివసించే వారందరూ కలసి బుదర కాకుండా మట్టి రోడ్డు వేయండి అంటూ అడిగారు. ఎవరూ వేయించలేదు. తలా కొంచెం డబ్బులు వేసుకుని వేయించుకున్నారు. ఎమ్మెల్యే ఆర్కే పర్యటించిన వెళ్లిన 10 రోజులకే గ్రావెల్ రోడ్డు వేశారు. రెండు సంవత్సరాల్లో బీటీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చి అమలు చేశారు. మా పిల్లలు అర్ధరాత్రి కూడా ఇంటికి వచ్చే విధంగా రోడ్డు వేయడం ఆనందంగా ఉంది.

– పద్యాల హేతిరాజు సంపత్‌కుమార్

26న తుళ్లూరులో రైతులతో సీపీఐ ముఖాముఖి



అమరావతి రైతులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శివర్గ సభ్యుడు ముప్పాళ్ల

తాడికొండ: బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 26న తుళ్లూరులో రైతుల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శివర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. తుళ్లూరులోని రైతు దీక్షా శిబిరాన్ని ఆదివారం సందర్శించి రైతులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని రక్షించండి– దేశాన్ని కాపాడండి అంటూ ఈ నెల 17 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 26న తుళ్లూరులో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, ఏఐటీయూసీ కార్యదర్శి అడ్వకేట్ జి.వి.రాజు, కె. దేవునిదయ, రైతు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

26న మంగళగిరి చేరనున్న సీపీఐ బస్సు యాత్ర



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య

తాడేపల్లి రూరల్: రాష్ట్రాన్ని రక్షించండి – దేశాన్ని కాపాడండి అని నినదిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 17న విశాఖలో ప్రారంభమైన బస్సు యాత్ర 26న సాయంత్రం మంగళగిరి చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆటోనగర్ అల్పా హోటల్ సెంటర్ వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరిగే బస్సు యాత్రలో నాయకులు, కార్యకర్తలు, రైతులు, కూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, తాడేపల్లి మండల కార్యదర్శి మునునూరు సుహాస్, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, మునగాల రామారావు, గుంటక సాంబిరెడ్డి, జి. శివ, షేక్ ఖాసిం, శీలం శ్యామ్ పాల్గొన్నారు.

రామాలయంలో గణేష్ యూత్ శ్రమదానం



తాడేపల్లి రూరల్: ఉండవల్లి రెడ్ల బజార్‌లోని రామాలయం వద్ద ఆదివారం గణేష్ యూత్ శ్రమదానం చేసింది. గుడి పరిసరాలలో చెత్తాచెదారాన్ని తొలగించారు. బావిలోకి దిగి చెత్తను శుభ్రం చేశారు. తొలుత బావిలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాల్ని బయటకు తీసి అనంతరం పూర్తిగా నీటిని తోడి, పూడికతీత చేపడతామని ఉండవల్లి గణేష్ యూత్ నిర్వాహకులు తెలిపారు. ఇక నుంచి బావిలో చెత్తాచెదారాన్ని వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, నీటిని కూడా అందరూ ఉపయోగించుకునే విధంగా మోటారును ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయిన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గుంటూరు నుంచి కర్నాటక వెళుతున్న ఆర్టీసీ బస్సు వేములూరిపాడు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్, గోపి, మురళీలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని మరో వాహనంలో చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చల్లా కిశోర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

తాడేపల్లి రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అమ్మే వ్యక్తిని, కొనుగోలు చేసే వ్యక్తిని యస్ఐ రమేష్ ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. హైదరాబాద్ బండ్లగూడకు చెందిన మహమ్మద్ ఉస్మాన్ పాషా (అలీ) బతుకు తెరువు నిమిత్తం మంగళగిరి రూరల్ యర్రబాలెంలో నివాసముంటూ, మంగళగిరి పట్టణ పరిధిలో బేకరీ పని చేస్తున్నాడు. ఇతడికి తాడేపల్లి కొత్తూరుకు చెందిన శివయ్య మద్యం తాగేటప్పుడు పరిచయం అయ్యాడు. తాపీ పని చేసే శివయ్య వద్ద ఇటీవల డబ్బులు లేకపోవడంతో గంజాయికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలోనే ఉస్మాన్ పాషాకు కూడా అలవాటు అయ్యింది. ఇటీవల అతడు యర్రబాలెంలోని స్నేహితుడు యాసిన్ వద్ద ద్విచక్ర వాహనం తీసుకువెళ్లి పాడేరు నుంచి గంజాయి కొనుగోలు చేసి తెచ్చి, శివయ్యకు ఇచ్చాడు. కృష్ణనగర్ శివారు ప్రాంతంలోని శ్మశానం వద్ద శివయ్య అమ్ముతుండగా సీఐ శేషగిరిరావుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు అక్కడకు వెళ్లి తనిఖీ చేయగా ద్విచక్ర వాహనంలో గంజాయితో పాటు శివయ్య దగ్గర చిన్న పొట్లాలు దొరికినట్లు యస్ఐ రమేష్ తెలిపారు. ఉస్మాన్ పాషా వద్ద గంజాయిని అమ్మేందుకు ఉపయోగించే కాటా లభించిందన్నారు. ఇద్దరి వద్దా 1200 గ్రాముల గంజాయి లభించడంతో వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

వెంకటేశ్వర యోగి గురూజీకి అభినందనలు



యోగి గురూజీని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: నగరానికి చెందిన శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెంకటేశ్వర యోగి గురూజీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పొందిన సందర్భంగా ఆదివారం నగరంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వెంకటేశ్వర యోగికి పీహెచ్‌డీ రావడం పెద్ద విశేషం కాదని, పద్మశ్రీ రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. అవసరమైతే ఇందుకు తన వంతు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని హామీ నిచ్చారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ సమాజానికి విలువలు నేర్పిన వ్యక్తిత్వాన్ని భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా వెంకటేశ్వర యోగి జీవిత చరిత్రను సమాజానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. సత్కార గ్రహీత వెంకటేశ్వర యోగి గురూజీ మాట్లాడుతూ నేడు ప్రపంచ ప్రజలందరినీ భాషలకు, ప్రాంతాలకు, కులాలకు, మతాలకు అతీతంగా ఏకం చేయగలిగినటువంటి ఏకైక విద్య యోగా విద్య మాత్రమే అన్నారు. ఇది తన పీహెచ్‌డీ ద్వారా ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి సమర్పించిన గ్రంథ సారాంశమని వివరించారు. శరీరం ఆరోగ్యంగా, మనస్సు ప్రశాంతంగా, సంఘం శాంతిగా ఉండాలన్నా ఏకైక విద్య యోగా మాత్రమేనని పేర్కొన్నారు. అనంతరం శ్రీవెంకటేశ్వర యోగి గురూజీకి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించి మెమెంటోను బహూకరించారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్య మంద్రు శ్రీనివాసకుమార్, డాక్టర్ గోలి రామ్మోహనరావు, సీకే జూనియర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ మంచా విజయ మోహనరావు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి



మంగళగిరి: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీమ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం నాయకులు నగరపాలక సంస్థ కార్యాలయం, రాజీవ్ సెంటర్, భార్గవపేటలోని రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు కుప్పాకుల కృష్ణారావు, పఠాన్ సుభాని, రేమిణిశెట్టి హనుమంతరావు, కూర్మాల రాధిక, గోలి సాంబశివరావు, కురగంటి చిక్కయ్య పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలలో

వైఎస్సార్ సీపీ ప్రభంజనం

తాడికొండ నియోజక వర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న సమన్వయకర్త సురేష్‌కుమార్

మేడికొండూరు: పంచాయతీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించిందని తాడికొండ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని డోకిపర్రులో ఆదివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 66 చోట్ల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 53 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగుర వేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలు జగనన్నకు మరలా పట్టం కట్టడం అనేదానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కూడా వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో 175 స్థానాలకు గాను మొత్తం వైఎస్సార్ సీపీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక పక్క యువగళం పేరుతో తెలుగుదేశం పార్టీ, మరో పక్క చంద్రబాబు దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ చేస్తున్న వారాహి యాత్ర దొంగల యాత్రగా పేరుదొంతుందని, వారి మాటాలు వినే పరిస్థితి రాష్ట్ర ప్రజలు లేరని ఆయన వివరించారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి బ్రహ్మరథం

మేడికొండూరు మండల పరిధిలోని డోకిపర్రులో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజక వర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు రాని వారికి దగ్గరుండి అమలయ్యేలా చూడాలిని అధికారుల్ని కోరారు. సురేష్‌కుమార్ రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. అడుగడుగునా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ప్రజలకు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రామకోటమ్మ, ఆర్‌బీకే చైర్మన్ ఉడతా శ్రీనివాసరావు, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, కోటి, బాలస్వామి, అర్జునరావు, సుభాని, షరీఫ్, రమేష్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించాలి



చేనేత నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘం నేతలు

మంగళగిరి: చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి రక్షించి, కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని చేనేత రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం చేనేత నాయకులు చిమ్మన నాగభూషణం, అందె నరసింహారావు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు చేనేత సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చిమ్మన నాగభూషణం, అందె నరసింహారావు అనేక ఉద్యమాలు చేపట్టి తుది శ్వాస వరకు పోరాటం చేశారని కొనియాడారు. చేనేత సంఘాల నాయకులు వారిని ఆదర్శంగా తీసుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తూరి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఎన్. బ్రహ్మేశ్వరరావు, డి. ఈశ్వరరావు, జె. జాన్‌బాబు, ఎ. ప్రభాకర్, జి. వెంకటకృష్ణ, బి. గిరి, ఆర్. అజయ్, జి. వెంకటేశ్వరరావు, ఎ. శ్రీనివాసమూర్తి, సీహెచ్. వెంకటేశ్వరరావు, వి. ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎస్. సుబ్రహ్మణ్యం, బి. నాగేంద్రం, జి. వెంకయ్య పాల్గొన్నారు.

ఘనంగా జానపద కళావిర్భావ దినోత్సవం

తెనాలి: అంతర్జాతీయ జానపద కళావిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ హాలులో నిర్వహించిన సభకు విద్యా కో–ఆర్డినేటర్ సీహెచ్. శ్రీదేవి అధ్యక్షత వహించారు. కన్వీనర్ బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ జానపద కళారూపాల ఇష్టాగోష్ఠి సోమ, మంగళవారాల్లోనూ జరుగుతుందని తెలియజేశారు. జానపద కళలు అంతరించిపోకుండా చూడాలని లక్కరాజు లక్ష్మణరావు సూచించారు. కోలాటం, చెక్కభజన గురువు సనకా ప్రసాద్ ఆయా కళల ప్రాముఖ్యతను వివరించారు. సాహిత్యం, జానపద విశ్లేషకుడు డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యకవి మాట్లాడుతూ జానపద కళలను ప్రజలు, ప్రభుత్వం ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. 'ఉత్తమ ఉపాధ్యాయుడు' ఎంవీ రఘునాథరావు, హరికథా భాగవతారిణి బెజ్జంకి నాగమణి, వాల్మీకి విజయలక్ష్మి, శారదా చలపతి, జ్యోతి, శివకుమారి, విజయదుర్గ, సర్వెన శ్రీనివాసరావు, యర్రం అప్పారావు మాట్లాడారు.

సానుకూల దృక్పథంతోనే జీవితంలో ఉన్నతి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రియా చౌదరి

తాడేపల్లి రూరల్: సానుకూల దృక్పథంతోనే జీవితంలో ఉన్నతి సాధ్యమని, దాన్ని విద్యార్థులంతా అలవరచుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ప్రియా చౌదరి సూచించారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన మానసిక వికాస తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులంతా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రత్యేకమైన లక్ష్యాల్ని ఏర్పరచుకుని తల్లిదండ్రులు ఆనందపడేలా జీవితంలో ఎదగాలని చెప్పారు. మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె. రూతు రమ్య మాట్లాడుతూ కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి శివ కాంచనలత సహకారంతో విద్యార్థులకు మానసిక వికాసంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, కో– ఆర్డినేటర్ శివగంగ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, పూర్వ విద్యార్థుల అసిస్టెంట్ డైరెక్టర్, మహిళా అభివృద్ధి సెల్ కో– కన్వీనర్ డాక్టర్ కె.సోని, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఆర్.కె.రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ (ఫైల్)

మంగళగిరి: యర్రబాలెం సినిమా హాల్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెం వేపచెట్టు సెంటర్‌కు చెందిన దానబోయిన నాగయ్య, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు అశోక్ (30) శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై మంగళగిరి నుంచి ఇంటిరి వస్తున్నాడు. మార్గం మధ్యలోని సినిమా హాల్ సెంటర్‌కు వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంటి ప్రహరీ గోడను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం ఉదయం అశోక్ మృతదేహాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య , పదేళ్ల కుమారుడు ఉన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే సంతాపం

వైఎస్సార్ సీపీ నాయకుడు దానబోయిన నాగయ్య కుమారుడు అశోక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఎమ్మెల్యే ఆర్కే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన నాగయ్యను ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.